# ఆదిశేషయ్య

ఒక మనిషిలోని మార్పుకు ముఖ్యంగా ఆర్థిక స్థితిగతుల వెలుగు నీడలే కారణాలు. ఈ సత్యాన్ని గ్రహించటానికి తను ఇన్నేళ్ళ బ్రతుకును వ్యర్థపుచ్చాల్సి వచ్చింది – అనుకున్నాడు ఆదిశేషయ్య.

తొమ్మిది గంటల ఉదయపు ఎండ వేసవికాలపు తీక్షణత్వానికి నాందీ ప్రస్తావనలు పలుకుతోంది.

ఆ వీధి మొగదల ఖాళీ ప్రదేశంలో ఓ వేపచెట్టు వుంది. ఆ చెట్టు క్రింద ఓ పూరిల్లు వుంది. ఆ పూరిల్లు చూస్తుంటే దీర్ఘ వ్యాధి పీడితుని మానసిక దుస్థితి స్ఫురణ కొస్తుంది. ఆ కొంపయినా తండ్రి హయాములో కట్టిందే. ప్రతి వానాకాలానికి ముందు ఇంత వరిగడ్డి కప్పుతాడు తను వాననీళ్ళు పడకుండా. తన బ్రతుకులో ఆ పూరికొంపను పడగొట్టి క్రొత్త ఇల్లును కట్టలేకపోయాడు. ఆ కొంపకుమల్లేనే దిక్కులేకుండా దీనాతిదీనంగా అందులో పడి చినికి చినికి పోతున్నాడు తను. కాలం తన బ్రతుకుపై మార్పు తేలేదు. అందుచేతనే ఆ పూరికొంపను మార్చలేకపోయాడు. తన బ్రతుకులో చేదు ఎట్లా పెరిగి కరుడుగట్టిపోయిందో – తన ఇంటిముందు ఈ వేప చెట్టుకూడా అట్లా పెరిగి పెద్దదై పోయింది అనుకున్నాడు ఆదిశేషయ్య వేపచెట్టుక్రింద కుక్కిమంచంలో చతికెలబడి కూర్చుని.

వయస్సు వార్థక్యంలో పడ్డ దగ్గర్నుంచీ పరిసరాల్ని దృష్టిలో పెట్టుకొని, తనని గూర్చి సమీక్షించుకోవడం పనిగా పెట్టుకున్నాడు ఆదిశేషయ్య. ఆ సమీక్ష ఆత్మసంతృప్తికోసం కాదు. అలౌకిక జ్ఞానంతో, భగవద్భీతితో, నీతి నిజాయితీల కోసం నిలబడి జీవితాన్ని నాలుగు సరిహద్దుల మధ్య బంధించి – కొన్ని పొరబాట్లతో కుటుంబ ఆర్థిక పరిస్థితి అనారోగ్యంపాలు కావించినందుకు తనపై తనే కసి దీర్చుకుంటున్నాడు. తద్వారా ఓ రకమైన ఆనందాన్ని పొందటానికి ప్రయత్నిస్తున్నాడు.

"తాతా! తాతా! ఆ గాలిపటం ఎంచక్కా మబ్బుల్లో ఆడుకుంటుందో చూడు" అంటూ ఇంటిలోనుంచి మనుమడు రామసుబ్బులు చొక్కాతో మూతి తుడుచుకుంటూ వేపచెట్టు నీడకొచ్చాడు. వాడప్పుడే అన్నం తిన్నాడు.

ఎదురుగ్గా చంద్రశేఖరంగారి మేడ మూడో అంతస్థుమీద నుంచి ఆయన మనుమడూ, మనుమరాలూ గాలిపటం ఉషారుగా ఎగురవేస్తున్నారు. రామసుబ్బులు తాతయ్యకు ఆసక్తిగా ఆగాలిపటాన్ని చూపెట్టాడు.

ఆదిశేషయ్య ముడుతలుపడ్డ ముఖాన్ని నిశ్శబ్దంగా చిట్లించి – ఆ మేడ కేసి చూడసాగాడు. ఎరుపూ, పసుపూ, ఆకుపచ్చ రంగుగల ఆగాలిపటం పిల్లల ఉత్సాహపు విశాలత్వాన్ని ప్రకటిస్తూ – ఆకాశవీధిలో విహరిస్తోంది. ఆ గాలిపటం ఆదిశేషయ్య కనుచూపుకు ఆనలేదు. చూడాలన్న అభిలాష కూడా లేదు. చుట్టూ అందమైన ప్రహరీతో, ఆ ప్రహరీమధ్య అంతకంటె అందమైన పూలతోటల్లో, ఆధునిక పద్ధతులపై బ్రహ్మాండంగా నిర్మించబడి, గులాబిరంగుతో మెరుస్తోన్న చంద్రశేఖరంగారి మూడంతస్థుల మేడ ఆయన చూపులో విజయగర్వంతో వికటాట్టహాసం చేస్తూంటుంది. అయిదేళ్లుగా రోజూ ఆ వేపచెట్టుక్రింద కుక్కిమంచం మీద కూర్చునే ఆమేడ కేసి చూస్తున్నాడు.

ఆ మేడ అయిదేళ్ళ క్రితం నిర్మించబడింది. అంతకు ముందు ఆ స్థలంలో చిన్న డాబా వుండేది. అంతకు మునుపు ఓ చిన్న పెంకుటిల్లు. ఇంకా అంతకు క్రితం రెండు నిట్టాడులుగల ఓ పూరి ఇల్లు. ఆ మార్పులన్నీ

ఇరవై యేళ్ళలో జరిగాయి. ఇరవై యేళ్ళలో చంద్రశేఖరంగారి జీవితం పోలికకు అందనంతగా అభివృద్ధి చెందింది.

ఇప్పుడు చంద్రశేఖరంగారు అని పిలువబడే ఈయన ఇరవై యేళ్ళ క్రితం చంద్రిగాడూ, చంద్రయ్యా! అప్పుడు వాడు కూడా తనలాగే లాగుడుబండి లాగేవాడు. బియ్యపు మూటలూ, నూనె డబ్బాలూ, సిమ్మెంటు బస్తాలూ మోసేవాడు. అట్లాంటి వాడిని అదృష్టదేవత చేతు లెత్తి ఆహ్వానించింది. ఇప్పుడు లక్షాధికారియైనాడు. డబ్బుతో పాటు సంఘంలో హోదా, స్థానమూ, పరువు ప్రతిష్ఠలు, పెద్దమనిషి తత్వమూ అన్నీ పెరిగిపోయాయి. చివరకు పేరును కూడా పొడిగించుకున్నాడు. ఈ టవున్లో షావుకార్ల జాబితాలో చేరాడు. పైగా వీడు 'నన్నేమీ అదృష్టదేవత వరించలేదు. అంతా స్వశక్తిమీదే సంపాదించుకొని, ఇంత వాడ్ని అయినాను' అని గర్వంగా చెప్పుకుంటాడుట'. వాడి కళ్లు నెత్తి మీద కెక్కాయి. ధనమదాంధుడై సంచరిస్తున్నాడు. ఒకప్పుడు తనతో పాటు కాయకష్టం చేసి రోజు కూటికి వెతుకులాడుకొనేవాడేగా! అట్లాంటివాని ఇప్పుడు తనని రోజూ చూస్తూనే – ఏమి ఎరగనట్టే ముఖం ప్రక్కకు తిప్పుకొని పోతుంటాడు. కొన్ని లక్షల డబ్బూ, మూడంతస్థుల మేడా, కారూ, డాక్టరీ చదువుకొన్న కొడుకూ, అందుకే వాడికి గర్వం, కళ్ళు ఆకాశాన వుండటం, పాత స్నేహితుల్ని మర్చిపోవటం. డబ్బు మనిషిని పూర్తిగా మార్చివేస్తుంది. మనస్సులో మహారాజు. బయట కిరీటంలేని చక్రవర్తిలాగ వెలుగుతున్నాడు. అయినా ఆ చంద్రిగాడు నిజంగా సుఖపడుతున్నాడా? వాడి మనస్సుకు శాంతి ఉన్నదా? ఆదిశేషయ్య ఆలోచనలు ఆ విధంగా నడుస్తూండగా – రామసుబ్బులు జోక్యం కలిగించుకున్నాడు.

"తాతా! నిన్న వాళ్ళ ఇంటి కెళ్ళాను. వాళ్ళబ్బాయి పిల్చాడు – గాలి పటాలు ఎగుర వేద్దామని. అబ్బ! వాళ్ళ ఇల్లు ఎంత బావుందను కున్నావ్? నడిస్తే మాసిపోయేట్టుంది గచ్చు. గోడలకు ఎన్ని రంగులు? ఎన్ని బొమ్మలు? ఆ కుర్చీలు, బీరువాలు, ఫ్యాన్లు – సినిమాల్లో స్వర్గ లోకం మల్లేవుంది ఆ మేడ. వాళ్ళబ్బాయికి ఎన్ని మంచి లాగూలు,

చొక్కాలున్నాయనీ! నాకు బిస్కెట్లు పెట్టాడు. రోజూ రమ్మన్నాడు ఆడుకుంటానికి. వస్తానన్నాను." అన్నాడు రామసుబ్బులు నిర్మలమైన నీళ్ళపై తెల్లని వెన్నెల పడుతూన్నంత ఉత్సాహంగా.

ఆదిశేషయ్య మనుమడ్ని కసిగా విసుక్కున్నాడు. "ఏడ్చావ్! వెధవా! వాళ్ళ ఇంటికి వెళ్ళబోక. వాళ్ళ తాత లేడూ – ఆ తుమ్మ మొద్దు అవతారం; వాడు కసాయివాడు. మనిషి పచ్చినెత్తురు త్రాగే రాక్షసుడు. దుర్మార్గుడు."

"వాళ్ళ తాత ఎట్లాంటివాడైతేనేం! వాళ్ళబ్బాయి మంచివాడు. గాలిపటాలిస్తాడు. బిస్కెట్లు పెడతాడు. మెత్తని కుర్చీల్లో కూర్చోబెట్టుమంటాడు" అన్నాడు రామసుబ్బులు కనుబొమలు ఎగురవేస్తూ.

"ఈ తడవ వాళ్ళ ఇంటిచాయల కెళ్ళావంటే నీ ముక్కాలు విరగ్గొడతాను వెధవా!'' అన్నాడు ఆదిశేషయ్య కోపోద్రేకంతో.

"అయితే గాలిపటం నువ్వు కొనిస్తావా? బిస్కెట్లు పెడతావా? మనింట్లో కుర్చీలేవీ!'' అన్నాడు రామసుబ్బులు బుంగమూతి పెట్టి.

ఆదిశేషయ్య నిశ్చేష్టుడైనాడు. మనమడి మాటలు గుండెల్లో విచ్చుకత్తుల్లా గుచ్చుకున్నాయి. ఒక్కసారి నీరసించిపోయాడు.

మేడమీద గాలిపటా లెగురవేస్తూ చంద్రశేఖరం మనుమడు చేయి వూపగా, రామసుబ్బులు పరుగెత్తు కెళ్ళాడు మేడకేసి. ఆదిశేషయ్య అది గమనించలేదు.

అవును. తను మనుమడికి గాలిపటం కొనివ్వలేడు. బిస్కెట్లు పెట్టలేడు. ఈ పూరికొంపలో కుర్చీలు లేవు. తనది దారిద్ర్యపు బ్రతుకు. ఆ దారిద్ర్యం వంశపారంపర్యంగా వస్తూన్నది. తన కొడుకు కూడా దారిద్ర్యంగానే బ్రతుకుతున్నాడు. లాగుడు బండిమీద వచ్చే కూలితోనే ఏ రోజుకారోజు పొయ్యిమీద కుండ ఎక్కాలి. తను చదువుకోలేదు. తన కొడుకును చదివించలేడు. చంద్రశేఖరం చదువుకోలేదు. కాని కొడుకును పెద్ద చదువు చదివించాడు. వాడికా డబ్బులేకపోతే కొడుక్కి ఆ చదువు చెప్పించగలిగేవాడేనా!... ఆదిశేషయ్య మనస్సు ఆ వేళ

ఎందుకో మరీ బావుండలేదు. అనూయా ద్వేషాల ఉష్ణోగ్రతలో శరీరం వేడెక్కుతూన్నది. అసంతృప్తిపూర్వకమైన ఆవేశం గట్లులేని ప్రవాహం పగిది పొర్లుకొస్తూన్నది.

ఆ సమయంలోనే చంద్రశేఖరం ప్లేమత్ కారులో బజార్నుంచి ఇంటికి రావడం జరిగింది. ఆ కారు రేపిన దుమ్ము వీధి ప్రక్క వేపచెట్టు క్రింద కూర్చున్న ఆదిశేషయ్య ముఖంపై వాలింది. ఆదిశేషయ్య కసిగా గొణుక్కున్నాడు.

... ఏమిటి వీడి విరగబాటు? డబ్బు సంపాదించినదే సరికాదు. అధర్మానికీ, అక్రమానికీ. కిరాతకానికీ దిగితే – లోకంలో డబ్బు సంపాదించటానికి అనేక రకాలైన అవకాశాలున్నాయి. అవి పద్ధతులు కావు. పైన భగవంతుడు ఒకడున్నాడని గుర్తిస్తే, డబ్బుకోసం, హోదా కోసం, కీర్తి కోసం చేసే దుష్కృత్యాలకు ఒకప్పుడు విధి ఏర్పర్చే న్యాయ స్థానంలో సంజాయిషీ చెప్పుకోవాల్సి వుంటుందన్న అగత్యాన్ని గమనిస్తే– మానవుడు ఇంత స్వార్థపరుడు కాడు; దుష్టాత్మతో ప్రవర్తించడు; అక్రమానికి పాల్పడడు. మానవత్వపు విలువలకు గౌరవాన్ని యిస్తూ న్యాయ మార్గానికి జీవితంలో కట్టుబడి వుండటంవల్లనే తను పెరగలేకపోయాడు. గొంగళి సామెతలాగ నిలిచిపోయాడు. వొంట్లో రోగం ముదురుతున్నా నయం చేయించుకొనే తాహతులేదు. ఇరవై యేళ్ళ క్రితం వీరభద్రయ్యగారు ప్రోత్సహించిన హత్యను తను చేసివుండినట్లయితే – ఈపాటికి చంద్రిగాడు వుండే హోదాలో, స్థానంలో వుండేవాడు తను. చంద్రిగాడు ఆ హత్య చేశాడు. తన భార్యతో కిళ్ళీకొట్టు మస్తాన్‌కు అక్రమ సంబంధం వుందని వీరభద్రయ్యగారికి గట్టి అనుమానం. మస్తాన్‌ను హత్య చేస్తే అయిదువేలు యిస్తానని తనతో ముందుగా చెప్పాడు. తను ధైర్యం చేయలేకపోయాడు. మానవ సహజమైన జాలీ, దయా, పాపభీతీ తనలో ఏడ్చి ఆ దారుణ కృత్యానికి పాల్పడనీయలేదు. ఆ చంద్రిగాడి గుండె బండరాయి గనుక, వాడి హృదయంలో దయాదాక్షిణ్యాలకు రవ్వంత చోటులేదు గాబట్టి, పరమ దుర్మార్గంతో, మొండి ధైర్యంతో మస్తాన్‌ను కొండల చాటుకు తీసికెళ్ళి చంపి, నామరూపాలు లేకుండా చేశాడు.

అయిదు వేలు పుచ్చుకున్నాడు. ఆ డబ్బుతో హోటలు పెట్టాడు. దాని మీద పదివేలు సంపాదించాడు. ఆ పదిహేను వేలతో రకరకాలైన వ్యాపారాలు, మోసాలు, టక్కరితనాలు చేసి - ఇప్పుడు లక్షాధికారి అయ్యాడు. ఒక పాపకృత్యం వాడి జీవితాన్ని ఎంత సుఖంగా మార్చింది! ఒక దుర్మార్గం వాడి బ్రతుకులో ఎంత భాగ్యాన్ని తెచ్చిపెట్టింది! .. కాని ఆ సుఖం వాస్తవమా? ఆ భాగ్యం శాశ్వతమా! కాదు. కాకూడదు. చంద్రయ్య లోకులు అనుకుంటూన్నంత సుఖాన్ని పొందటం లేదు. వాని మనస్సుకు శాంతిలేదు. ఇరవై యేళ్ళ క్రితం చేసిన హత్యాపాతకం వాడి గుండెల్లో గగ్గోలు పుట్టిస్తూ, వుంటుంది. అందుకే అప్పుడప్పుడూ గుండె జబ్బు అంటూ పడక వేస్తూవుంటాడు. ఏదో పిశాచం గుండెమీద బరువుగా కూర్చుని కదల నివ్వదట. ఆ చంపబడ్డ మస్తాన్ పిశాచమై వాడ్ని పీక్కుతింటూ వుండొచ్చు. నేరం చేసినవాడు ఈ లోకంలో న్యాయస్థానాల శిక్షను తప్పించుకున్నా, భగవంతుడు వేసే శిక్షనుంచి తప్పించుకోలేడుగా! ఎంతటి పాషాణ హృదయుడైనా తన పాపాన్ని గురించి జీవితంలో భయపడక తప్పదు. ఆ భయంతో, చీకాకుతో, అశాంతితో - ఆ చంద్రిగాడికి ఎంత డబ్బున్నా సుఖశాంతు లెక్కడ్నుంచి వొస్తాయి? తను పాపం చేయలేదు. ఎంత బీదరికాన్ని అనుభవించినా - అన్యాయాలకూ, అక్రమాలకూ దిగలేదు ... అట్లా ఆదిశేషయ్య తరుచూ తనని గురించి తను గర్వపడుతూ వుంటాడు.

కోడె వయస్సు కోర్కెల్లా ఎండ మిడిసి పడుతోంది. వేపచెట్టు నీడ అతి నెమ్మదిగా జరుగుతోంది.

ఆదిశేషయ్య ఇంకా భోజనం చేయలేదు. కోడలు 'బువ్వ తిందువుగాని రా' అని పిలిచింది గానీ ఆలోచనల కాకలో వినిపించుకోలేదు. అయినా ఆయనకు ఆకలి వేసినట్టు లేదు. ఆలోచనల గొడవలో ఆకలి హరించుకు పోతోంది.

ఉన్నట్టుండి ఒక్కసారి చంద్రశేఖరంగారి మేడలోంచి ఏడ్పులు వినవచ్చాయి. ఆదిశేషయ్య ఉలిక్కిపడ్డాడు. మేడపైన గాలిపటాలు ఎగుర వేస్తూన్న పిల్లలు గాలిపటాల్ని గాలికి వొదిలేసి గబగబా క్రిందకు

దిగివచ్చారు. చుట్టు ప్రక్కల ఇళ్ళవాళ్లు గబగబా ఆ మేడలోకి ఆదుర్దాగా జొరబడ్డారు.

'ఏం జరిగింది! .. ఇంతకు ముందేగా చంద్రయ్య బారాటి కారులో ఇంట్లోకి వెళ్ళింది? ఇంతలో ఏంజరిగివుంటుంది?' అనుకున్నాడు ఆది శేషయ్య నుక్క మంచంలో సర్దుకొని కూర్చుని, ఆ మేడకేసి చూస్తూనే ఉన్నాడు ఏకాగ్ర ధ్యాసతో.

అయిదు నిముషాల్లో డాక్టరీ చదువుతూన్న చంద్రశేఖరం కొడుకు ఎక్కడ నుంచో కారు వేసికొని ఇంటికి వచ్చాడు. తర్వాత మూడు నిము షాలకే కారులో డాక్టరు రామకృష్ణ ప్రసాద్ హడావుడిగా లోపలకు వెళ్ళాడు.

– ఆ మేడలో ఎవరికి ఏం జబ్బో ఊహించలేక ఉక్కిరిబిక్కి రయ్యాడు ఆదిశేషయ్య. 'బువ్వకి వేళ కాలేదా?' అని కోడలు కేక వేసినా వినిపించుకోలేదు.

ఆ మేడ లోంచి మనుమడు రామసుబ్బులు బయటికి వచ్చాడు. ఆదిశేషయ్య వాడ్ని రమ్మని చేయి వూపాడు. దిగాలుపడ్డ ముఖంతో నెమ్మదిగా తాతయ్య దగ్గర కొచ్చాడు రామసుబ్బులు.

"ఏమిట్రా! ఆ మేడలో ఎవ్వరికిరా జబ్బు? ఏడుస్తున్నారెందుకు?" ఆసక్తిగా అడిగాడు ఆదిశేషయ్య.

"వాళ్ళ తాతయ్య గుండె జబ్బుతో మాటల్లేకుండా పడిపోయా డంట. ఏడుస్తున్నారు'' అన్నాడు రామసుబ్బులు.

"ఓహో" అన్నాడు ఆదిశేషయ్య. కనుబొమ లెగుర వేస్తూ.

తర్వాత కొద్దినిముషాలకే చంద్రశేఖరంగారి మేడలోంచి ఏడుపులు పెద్దగా వినిపించాయి.

'చనిపోయి వుంటాడు. అందుకే అంత పెద్దగా ఏడుస్తున్నారు. ఇరవై యేళ్ళ క్రిందట లాగుడు బండిమీద పొట్ట గడుపుకునే చంద్రయ్య నడిమంత్రపు సంపాదనతో లక్షాధికారియై ఈ క్షణం నుంచీ మట్టిలో కల్సి

పోయాడు. అంతే జీవితం! హెచ్చరికలేని సంఘటనల తోరణం. ఎంత దుర్మార్గం చేసీ, ఎన్ని మోసాలు చేసీ, ఎంత మేడ కట్టీ, ఎన్ని లక్షలు సంపాదించీ – ఏం ప్రయోజనం! చివరకు ఎట్లా పుట్టాడో అట్లాగే మట్టి పాలైనాడు. ఏం వెంటబెట్టుకెళ్ళాడు? కాని వాడు చేసిన దుర్మార్గం, దారుణ హత్య, ఘోరపాతకం – వాడి చిట్టాలో వ్రాయబడే వుంటుంది. అదే యీ జన్మకు వాడు మిగుల్చుకుంది" అనుకుంటూ నక్కిమంచంమీద నుంచి లేచాడు ఆదిశేషయ్య.

వేపచెట్టు నీడలు బరువుగా వొళ్లు విరుచుకున్నాయి.

"అన్నం పెట్టవే కోడలు పిల్లా" అన్నాడు ఆదిశేషయ్య ఇంటిలోకి ప్రవేశిస్తూ.

"పాపం! చంద్రశేఖరంగారు హఠాత్తుగా చనిపోయారట!" అన్నది కోడలు సానుభూతిపూర్వకమైన జాలితో.

"పాపం పండింది. టపాకాయలాగ ఎగిరిపోయాడు" అన్నాడు ఆదిశేషయ్య పాపాత్మునికి సుఖపడే గీత లేదన్నంత దృఢంగా.

"పాపమో, పుణ్యమో – ఎవరు చూశారు? మూడుతరాలవాళ్ళకు సరిపడ్డంత ఆస్తి సంపాదించాడు. ఆయన పేరు చెప్పుకుంటూ కొడుకూ, కొడుకు పిల్లలూ, వాళ్ళకు పుట్టే సంతతీ హాయిగా బ్రతుకుతారు. చచ్చిన వాళ్లు చావగా యీలోకంలో విడిచిపెట్టి వెళ్ళిన ఆస్తినిగురించేగా తర్వాత చెప్పుకొనేది! అన్నది కోడలు నిర్లక్ష్యంగా పెదాలు మెలిదిప్పుచూ.

ఇంటి చూరు బొంగు నుదురుకు కొట్టుకొన్నట్టుగా దిగ్భ్రాంతుడై కోడలికేసి చూశాడు ఆదిశేషయ్య.

(విహారి)

—o—